# తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి

## తెలంగాణ రాష్ట్రం

**TSUTF, TPTF, DTF, STF, TSPTA, TGHMA, DGTU, BTF, TUTA, TSCSTTA, TGPETA.**

**డోర్ నెం.1-2-288/8, చెన్నుపాటి భవన్ , దోమల్‌గూడ, హైదరాబాద్ - 500029**

---

ప్రచురణార్థం: తేది. 01.10.2016

## పెన్షన్ సౌకర్యానికి విఘాతం - ఉద్యోగి హక్కును కాలరాయడమే

## పోరాడి సాధించుకోవాల్సిందే! మీకండగా ఉంటాం.

**- కోదండరాం, డా॥ కె.నాగేశ్వర్**

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు (01.10.2016) ఇందిరాపార్కువద్ద పాతపెన్షన్ పునరుద్ధరించాలనే డిమాండుతో నిర్వహించిన **మహా ధర్నా**లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై సమరశంఖం పూరించాయి.

పెన్షన్ అనేది ఉద్యోగి జీవిత చరమాకంలో ఇబ్బందులకు గురికాకుండా సామాజిక భద్రతగా పొందుతున్న హక్కు. ఇది పాలకుల దయాదాక్షిణ్యాలతో పొందే భిక్షకాదు. అలాంటి పెన్షన్ సౌకర్యానికి విఘాతం కల్పించడం హక్కులను కాలరాయడమేనని పలువురు నేతలు అన్నారు.

తెలంగాణ జెఎసి చైర్మన్ ఎం.కోదండరాం ధర్నాకు హాజరై మాట్లాడుతూ పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను నూతన పెన్షన్ స్కీం పేరుతో తీసుకురావడమంటే పాలకులు తమ బాధ్యతను తప్పించుకోవడమేనని అన్నారు. ఇదంతా నూతన ఆర్థిక సరళీకరణ విధానం ఫలితమేనని అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ పేరుతో ఉద్యోగుల డబ్బును మార్కెట్‌లో మదుపు చేయడమంటే మార్కెట్‌శక్తులకు తాకట్టుపెట్టి ఉద్యోగులను త్రిశంకు స్వర్గంలోకి నెట్టడమేనని అన్నారు. పాతపెన్షన్ ఉండాలనేది ఉద్యోగుల కొత్తకోరికనో గొంతెమ్మ కోరికనో కాదు ఉన్న సౌకర్యాన్ని తొలగించరాదనేది ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపబడేదాకా జరిగే పోరాటంలో అండగా ఉంటామని అన్నారు.

మాజీ శాసనమండలి సభ్యులు డా॥ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు 1982 సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ తీర్పుకు కనీస విలువనివ్వపోవడమంటే పాలక వర్గాలకు న్యాయవ్యవస్థపట్ల ఉన్న గౌరవం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బహుళజాతి సంస్థలకు లక్షలకోట్ల రూపాయల పన్ను రాయితీలనిచ్చే ప్రభుత్వాలు ఇప్పుడు లక్షలకోట్ల రూపాయల పెన్షన్ నిధులను విదేశీ గుత్త సంస్థలకు అందజేయాలని చూడడమంటే "కాకులను కొట్టి గద్దలకు వేసి"నట్లేనని అన్నారు. 2004 నుంచి ఉద్యోగుల నుంచి వచ్చిన కాంట్రిబ్యూషన్ లక్షకోట్లకు పైగా ఉండగా రిటైరైన, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం ప్రయోజనం జరగకపోవడమ దుర్మార్గమని అన్నారు. కనీస పెన్షన్ గ్యారంటీ అనేది లేకుండా జాతీయ పెన్షన్ విధానం ఉద్యోగికి, ఉద్యోగి కుటుంబాలకు ఎలాంటి భద్రతనిస్తుందని ఆయన ప్రశ్నించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంపై జరిగిన చర్చ సందర్భంగా దానివలన ఎలాంటి లాభాలున్నాయో, ప్రస్తుత విధానానికి మించిన లాభాలెలా వస్తాయోనని నేనడిగిన ప్రశ్నకు అప్పటి ఆర్థికమంత్రి ఎలాంటి సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. ఇలాంటి దుర్మార్గమైన సిపిఎస్ విధానాన్ని రద్దుకోసం జరిగే పోరాటంలో మీ వెన్నంటి ఉంటానని అన్నారు.

భారీ సంఖ్యలో 5 వేలకు పైగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్న ఈ మహాధర్నాకు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఎ.నర్సిరెడ్డి (టిఎస్‌యుటిఎఫ్), బి.కొండల్‌రెడ్డి (టిపిటిఎఫ్), రఘుశంకర్‌రెడ్డి (డిటిఎఫ్), యు.పోచయ్య (ఎస్‌టిఎఫ్), షౌకత్‌అలి(టిఎస్‌పిటిఎ), మసూద్ అహ్మద్(టియుటిఎ), కె.రమేష్ (బిటిఎఫ్), ఆశీర్వాదం (డిజిటియు) తదితరులు మాట్లాడుతూ మాట్లాడుతూ నాటి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించిన సిపిఎస్ విధానం చట్టం కాకుండా క్రియాశీల ఉద్యమాలు, చట్టసభలలో అభ్యుదయ వాదుల బలంతో 2013 దాకా నిలువరించగలగడం ఒక ప్రత్యేకత అయినప్పటికీ తిరిగి 2013లో సైతం ఎన్‌డిఎ మద్దతుతోనే చట్టంగా రూపొందడం వెనుక మతలబును ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ అర్థం చేసుకోవాల్సిన అవసరమున్నదని అన్నారు. చట్టంకాకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు 2004 సెప్టెంబర్ నుంచి సిపిఎస్ విధానాన్ని అమలు చేయడమంటే పెట్టుబడిదారులకు ఊడిగంచేసేందుకు పడే ఉబలాటం దుర్మార్గమైందని అన్నారు. దేశంలోనే అందరికంటే ముందుగా ఏప్రిల్ 2003 నుంచి సిపిఎస్ అమలు చేసిన తమిళనాడు ప్రభుత్వం తిరిగి ఉద్యోగుల డిమాండు విషయంలో సానుకూలత వ్యక్తం చేయడం దేశవ్యాప్త ఉద్యమాల ప్రభావమేనని అన్నారు. ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారానే పాతపెన్షను పునరుద్ధరించుకునేందుకు సాధ్యమవుతుందని అన్నారు.

ట్రిబ్యునల్ బెనిఫిట్ స్కీం ప్రయోజనాలను హరిస్తే సహించేది లేదని అందుకోసం ఒక్కటై ప్రభుత్వాలు దిగివచ్చే విధంగా పోరాటాన్ని ముందుకు తీసికెళదామని అన్నారు.

ఈ ధర్నాలో చావ రవి, పి.మనోహర్‌రాజు, ఎంఎన్.కిష్టప్ప, వెంకట్‌రావు, సైదులు, నర్సింహా రావు, ఆశీర్వాదం, బి.కొండయ్య గార్లతోపాటు సిపిఎస్ సంఘాల నాయకులు కృష్ణకుమార్, సురధీర్, వి.రవి, డి.కమలాకర్, స్థితప్రజ్ఞ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, సాంఘికసంక్షేమ, గిరిజన సంక్షేమ సంఘ బాధ్యులు కె.వెంకట్‌రెడ్డి, టి.రమేష్, సీతా మనోహార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి పక్షాన

ఎ.నర్సిరెడ్డి

TSUTF అధ్యక్షులు